క్లుప్తంగా

పరామర్శ


పరామర్శిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

దహెగాం: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల దాసు అనే బీఆర్ఎస్ నాయకుడు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు మృతుని కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మండల రైతు బంధు సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి


అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కౌటాల: ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఈనెల 19వ తేదీలోగా ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఏపీఎం వెంకటరమణ, ఐకేపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో కోతుల బెడద


పైకాజీనగర్‌లో కోతులు పగులగొట్టిన కుండీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. ఇళ్లలోకి వస్తున్న కోతులు తినుబండారాలు ఎత్తుకెళ్లడంతో పాటు ప్రజలపై దాడులకు పాల్పడుతున్నాయి. బుధవారం పైకాజీనగర్‌లోని ఇళ్లలోని చెత్తకుండీలను పగులగొట్టి బీభత్సం సృష్టించాయి. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'వెంకటరమణ జీవితం ఆదర్శనీయం'

కాగజ్‌నగర్‌టౌన్: కార్మిక నేత, ప్రజాసంఘాల నిర్మాత, రచయిత వెంకటరమణ జీవితం ఆదర్శనీయమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్ అన్నారు. బుధవారం వెంకటరమణ ప్రథమ వర్ధంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సమ్మె శిబిరంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, గిరకుమార్, త్రివేణి, వినోద, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'డయల్ 100'పై అవగాహన

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం షీటీం ఏఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 డయల్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ క్రైం, అమ్మాయిలపై వేధింపులు, మహిళల భద్రత చట్టాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో బాలబాలికలు టోల్ ఫ్రీ నంబర్ 100, 1098 ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీం కానిస్టేబుల్స్ రమాదేవి, సునీత, హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాట	20
చిక్కుడుకాయ	80
సిమ్లామిరి	80
బీరకాయ	80
గోబి (పూల్)	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంత	60
దొండకాయ	120
మిర్చి	80
పాలకూర	40
సోరకాయ	50
క్యాబేజి	60

– ఆసిఫాబాద్‌అర్బన్

సినిమాలు

ఆసిఫాబాద్ (కుమురంభీం ఏ/సీ): జవాన్
కాగజ్‌నగర్ (వెంకటరమణ, ఏ/సీ): జవాన్

పక్కా భవనాలు లేక పరేషాన్

- ఏడు జీపీలకు భవనాలు మంజూరు
- స్థలాలు గుర్తించినా ప్రారంభం కాని పనులు
- పట్టించుకోని అధికారులు


స్లాబ్ వరకు పనులు పూర్తి చేసుకున్న బామానగర్ పంచాయతీ భవనం


అద్దె భవనంలో కొనసాగుతున్న పెసరికుంట జీపీ కార్యాలయం

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం గతంలో కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఆయా గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నాలుగు నెలల క్రితం పక్కా భవనాలు మంజూరు చేసింది. కాగా కొన్ని గ్రామాల్లో పక్కా భవనాల నిర్మాణాలకు స్థలాలు దొరకడం లేదు. స్థలాలను గుర్తించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

24 గ్రామపంచాయతీలు..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొత్త మండలాలు ఏర్పడిన తర్వాత కొన్ని గ్రామ పంచాయతీలు ఇతర మండలాల్లోకి వెళ్లాయి. నూతనంగా ఏర్పడిన మండలంలో దిగిడ, కర్జి, గెర్రె, కమ్మర్‌పల్లి, చౌక, పీపీరావు కాలనీ, బామానగర్, కల్వాడ, పెసరికుంట, బొర్లకుంట పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. వీటికి పక్కా భవనాలు లేకపోవడంతో పంచాయతీలను గ్రామాల్లోని పాఠశాలల భవనాలు, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు కొనసాగుతున్నందున మండలంలో నూతనంగా ఉపాధిహామీ పథకంలో ఆరు, ఐటీడీఏ ద్వారా ఒక పంచాయతీకి పక్కా భవనాలు మంజూరు చేశారు.

స్థలాల గుర్తింపులో జాప్యం..

మండలంలోని చౌక, కమ్మర్‌పల్లి, గెర్రె, పెసరికుంట, బామానగర్, చినరాస్పెల్లి గ్రామ పంచాయతీలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఒక్కో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. దిగిడ గ్రామ పంచాయతీకి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేశారు. బామానగర్‌లో పక్కా భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. పనులు స్లాబ్ వరకు కొనసాగాయి. మిగతా పంచాయతీలలో పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. చౌక, చినరాస్పెల్లి, గెర్రె, కమ్మర్‌పల్లి, పెసరికుంట పంచాయతీలలో స్థలాలు గుర్తించినా పనులు ప్రారంభించలేదు. దిగిడ గ్రామంలో అటవీ అధికారులు స్థలం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పక్కా భవనాలు లేక అద్దె భవనాలకు నెలకు రూ.1000 నుంచి రూ. 2000 వరకు అద్దె చెల్లిస్తున్నామని పాలకవర్గ సభ్యులు చెబుతున్నారు. కాగా అద్దె భవనాల్లో పంచాయతీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సర్పంచుల పదవీ కాలం దగ్గర పడుతున్నందున నూతన భవనంలోకి అడుగు పెట్టే భాగ్యం ఉందో లేదోనని ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. నూతనంగా 10 పంచాయతీలు ఏర్పాటు కాగా ఏడు పంచాయతీలకు మాత్రమే పక్కా భవనాల కోసం నిధులు మంజూరు కావడంతో మిగతా మూడు పంచాయతీలకు చెందిన పాలకవర్గ సభ్యులు నిరుత్సాహంలో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీల పక్కా భవనాల నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాటు మిగతా పంచాయతీలకు కూడా భవనాలు మంజూరు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

మండలంలోని ఆరు పంచాయతీలకు పక్కా భవనాల కోసం ఉపాధిహామీ పథకం కింద, దిగిడ పంచాయతీకి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయి. అన్ని జీపీలలో ఇప్పటికే స్థలాలు గుర్తించారు. భవన నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తాం. బామానగర్‌లో స్లాబ్ వరకు పనులు పూర్తయ్యాయి.

– ఆత్మారాం, పీఆర్ ఏఈ

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసనలు


ఆసిఫాబాద్‌అర్బన్: చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


రెబ్బెన: మాట్లాడుతున్న పార్లమెంట్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన నిరవధిక దీక్షలు బుధవారం 3వ రోజుకు చేరుకున్నాయి. నిరసనలో భాగంగా చెవిలో పూలు పెట్టుకొని అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలపై బెదిరింపులు మానుకొని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఉపేందర్, లోకేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వనిత, అంజలి, ధనలక్ష్మి, మంజుల, సులోచన, అరుణ, సువర్ణ, మమత, సూర్యమణి తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మెకు బుధవారం సేవాలాల్ సేనా నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ మాట్లాడారు. అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం చెల్లించాలన్నారు. శివాజీ, అనసూయ, గుణసుందరి, అయ్యూబాయి, రాధా, సావిత్రి, మీరా, మంజుల, చంద్రకళ, ఆయాలు వందన, జనాబాయి, సుశీల, రజిత ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షంలో తడుస్తూ సమ్మె చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, జీజాబాయి, ఇందు, మోక్ష, హేమవతి, ఆయాలు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని బీజేపీ పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించిన బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓడెలు తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: సమస్యలు పరిష్కరించాలని మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె బుధవారం మూడో రోజు కొనసాగింది. కాగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న స్థలం తనకు చెందిందని వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జిరాక్స్ సెంటర్ నడుపుతున్న దేవేందర్ అనే వ్యక్తి అంగన్‌వాడీ కార్యకర్తలను హెచ్చరించాడు. సమ్మె చేస్తున్న స్థలం తన పేరిట పట్టా ఉందని పేర్కొంటూ సదరు వ్యక్తి జెండాలు తొలగించినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోయారు. తమ డిమాండ్ నెరవేర్చాలని శాంతి యుతంగా కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో సమ్మె చేస్తున్నామని, అధికారులు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వజ్రమ్మ, జయ, భాగ్య, విజయ లక్ష్మి, పద్మ, పార్వతి, గౌసియా, ఆయాలు పాల్గొన్నారు.


కెరమెరి: సంఘీభావం తెలుపుతున్న సేవాలాల్ సేన నాయకులు


కౌటాల: వర్షంలో తడుస్తూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

'కాంగ్రెస్ గెలుపు అందరి బాధ్యత'


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్

ఆసిఫాబాద్: అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయించినా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు బాధ్యత అందరిదని ఆ పార్టీ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని పథకాలు తెచ్చినా ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు, అభిమానులు బూత్ స్థాయి సమావేశాలు నిర్వహించి, కమిటీలు వేయాలని సూచించారు. అనంతరం మండల అధ్యక్షులు, జిల్లా కీలక నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిల్‌గౌడ్, టీపీసీసీ సభ్యురాలు సరస్వతి, నాయకులు రాథోడ్ గణేశ్, శ్యాంనాయక్, బుర్స పోచయ్య, రాథోడ్ శేషారావు, కలీం, ఆసత్, ఆసిఫ్, గుండ శ్యాం, చరణ్, నారాయణ, కుసుమరావు, ముకిత్, దేవ్‌రావు, పరుశురాం, గోవింద్‌రావు, లోకేందర్, దీపక్ పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

సిర్పూర్(టి): కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు సైనికుల్లా కృషి చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాశ్ రాథోడ్ అన్నారు. సిర్పూర్(టి) మండలం వేంపల్లిలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానికులకే టికెట్ కేటాయించాలని ఓవర్గం.. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసేవారికే కేటాయించాలని మరో వర్గం నినాదాలు చేశారు. ఇదే పట్టుదల పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు చూపాలని ఎమ్మెల్సీ కార్యకర్తలను సముదాయించారు. కార్యక్రమంలో నాయకులు కె.కృష్ణారెడ్డి, రావి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన


నిరసన తెలుపుతున్న మిషన్ భగీరథ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు ఉపేందర్, లోకేష్‌లు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ప్రారంభించిన దీక్షలు బుధవారం 12వ రోజుకు చేరుకున్నాయి. నిరసన కార్యక్రమంలో భాగంగా కార్మికులు ఒంటికాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు బాలేశ్, సురేశ్, వెంకటేష్, అంబాజీరావ్, ఈశ్వర్, సంతోష్, తాజ్, శ్రీకాంత్, అనిల్, రవీందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నల్లదుస్తులు ధరించి నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని బుధవారం సమగ్రశిక్ష ఉద్యోగులు నల్లదుస్తులు ధరించి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సమగ్రశిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. సంఘం కోశాధికారి నగేశ్, నాయకులు సంతోష్, రమేశ్, మోహన్, సందీప్, మహేష్, సంతోష్, ధర్మయ్య, శ్రీనివాస్, రవి తదితరులు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు


మాట్లాడుతున్న మేనేజర్ సాయిచరణ్

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, బొంబాయిగూడ గ్రామాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు సాయిచరణ్, రాజేశ్వర్‌రావుల ఆధ్వర్యంలో బుధవారం ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఖాతాదారులకు అందిస్తున్న డిజిటల్ లావాదేవీలు, ఇన్సురెన్సుల సేవలపై వివరించారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ఫీల్డ్ అధికారి జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాసోత్సవాల సందర్భంగా కాలనీలోని చిన్నారులకు అన్నప్రాశన చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కాలనీ మహిళలు, కిశోర బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

ఇంద్రవెల్లి: ఏజెన్సీలోని మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హర్కపూర్, అంద్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని మామిడిగూడ(జి) గ్రామ సమస్యలను సర్పంచ్ కుడే కైలాష్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ దృష్టికి తీసుకెళ్లి రూ. 3 కోట్ల, 50 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం, రూ. 70 లక్షలతో రోడ్డు, కోలంగూడ గ్రామాభివృద్ధికి రూ. 35 లక్షల నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. నిధులు మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జీలానిబేగ్, సర్పంచ్ జాదవ్ లక్కన్, కుడే కైలాష్, తహరే గణేష్, మసుద్, కోరెంగా సుంకట్‌రావ్, కనక హనుమంత్‌రావ్, ఆరెల్లి రాందాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా పొలాల పండుగ


కాగజ్‌నగర్‌రూరల్: పూజలు చేస్తున్న మహిళ


చింతలమానెపల్లి: అలంకరించిన ఎడ్లతో రైతులు

కెరమెరి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పొలాల అమావాస్య పురస్కరించుకొని సందడి వాతావరణం నెలకొంది. రైతులు ఎద్దులకు మెడలో గంటలు, వీపుపై రంగురంగుల జూలు, కొమ్ములకు పూసేందుకు రంగులు, రకరకాల కాగితాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు. బడిగా పేరుతో నిర్వహించే కార్యక్రమం అనంతరం శ్రావణమాసం ముగుస్తుంది. ఈసందర్భంగా శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో బుధవారం పొలాల అమావాస్య పండుగను రైతులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఉదయం ఎడ్లతో పాటు వ్యవసాయ పరికరాలను అలంకరించి స్థానిక ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలను తయారు చేసి సమర్పించారు.

చింతలమానెపల్లి: మండలంలో పొలాల అమావాస్య పండుగను బుధవారం రైతులు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా వచ్చే పొలాల అమావాస్యను ఏటా రైతులు ఘనంగా నిర్వహిస్తారు. పండుగ సందర్భంగా రైతులు మహాశివుడికి పూజలు నిర్వహించారు. పశువులను అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పొలాల అమావాస్య పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎద్దులను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రాస్పెల్లి, అందవెల్లి గ్రామాల్లో ఎద్దులను ఊరేగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అధ్యాపకుల బదిలీలు చేపట్టాలి


కెరమెరి: ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న అధ్యాపకులు

కెరమెరి: ఇంటర్మీడియెట్ విద్యావ్యవస్థలో తక్షణమే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల అసోసియేషన్ 175 జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పర్శరాములుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత 13సంవత్సరాలుగా ఒకే చోట విధులు నిర్వహించడం వల్ల బదిలీలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. బదిలీలు చేపట్టాలని కోరుతూ సీఎం కార్యాలయానికి వినతిపత్రాలు మెయిల్ చేసినట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు కుత్‌బోద్దిన్, శ్రీనివాస్, స్వామి, బైరాగి, కిషోర్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

జైనూర్: వెంటనే అధ్యాపకుల బదిలీలు చేపట్టాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, బదిలీలు సత్వరమే చేపట్టాలని కోరుతూ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవికి అధ్యాపకులు బుధవారం వినతిపత్రం అందించారు.

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు


కెరమెరి: పూజలు చేస్తున్న మహిళలు


బెజ్జూర్: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బెజ్జూర్: మండల కేంద్రంలోని శివాలయంలో బుధవారం శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య ఏకాదశ అభిషేకంతో పాటు మాసశివరాత్రి పంచామృత అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు.

కెరమెరి: శ్రావణమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయం, నెహ్రూనగర్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్, తిర్యాణి మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు.

మాన్కాపూర్ జీపీకి పురస్కారం

నార్నూర్: జిల్లాలో ఉత్తమ జీపీగా ఎంపికైన 17 పంచాయతీల్లో మండలంలోని మాన్కాపూర్ ఒకటి. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా సర్పంచ్ రాథోడ్ సావీందర్, ఎంపీడీవో రమేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లవ్‌కుమార్ అవార్డు అందుకున్నారు.

చేప పిల్లల పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని గిన్నేర చెరువు, ముత్నూర్ త్రివేణి సంఘం చెరువు, కేస్లాపూర్ చెరువులో బుధవారం మత్స్యకారుల శాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. మత్స్యకారుల ఫీల్డ్ అసిస్టెంట్ వినోద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.